సమావేశాలకు రాకుంటే ఎలా?

- గైర్హాజరైన అధికారులపై ఆర్జేడీ ఆగ్రహం
- ఆరుగురు సీఎస్, 18 డీవోలకు మెమోలు జారీ చేయాలని ఆదేశం


మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలకు సన్నద్ధం చేసేందుకని నిర్వహించే సమావేశాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు గైర్హాజర్ కావడం తీవ్రంగా పరిగణించాల్సిందేనని విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి అన్నారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు జూన్ 2 నుంచి ప్రారంభమయ్యే అడ్వాన్స్‌డ్ పరీక్షలపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలా వ్యవహరించాలనే దానిపై చర్చించారు. అయితే కీలకమైన సమావేశానికి పలువురు సీఎస్, డీవోలు గైర్హాజరయ్యారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ పరీక్షలకు జిల్లాలో 5,981 మంది హాజరౌతుండగా, వీరి కోసమని 24 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. అయితే శుక్రవారం నాటి సమీక్ష సమావేశానికి సీఎస్‌లు 24 మందికి గాను 18 మంది, డిపార్ట్‌మెంట్ అధికారులు కేవలం 6 గురు మాత్రమే వచ్చారు. దీనిపై ఆర్జేడీ జ్యోతి కుమారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గైర్హాజరైన వారందరికీ మెమోలను జారీ చేసి, వారి నుంచే వచ్చే సంజాయిషీ వివరాలను కూడా తనకు నివేదించాలన్నారు. డీఈవో జీ. లక్ష్మణరావు, పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మురళీ మోహన్, డెప్యూటీ డీఈవో గౌరీ శంకర్, సిబ్బంది భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


34వ వార్డు ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు తీసుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం 36వ వార్డు జామియా మసీదు, 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ప్రజల నుండి వచ్చిన వినతులకు సంబంధించి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. 34వ వార్డు కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, బోణి దేవ, బొడ్డేటి కిషోర్, రామరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే 36వ వార్డు ఏవీఎన్ కళాశాల దరి జామియా మసీదు వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పోర్టు వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో పాల్గొనాలని ఈవో శ్రీనివాస్, సిబ్బంది ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో 30వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, నీలాపు లక్ష్మీ, బెహరా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సిద్ధంగా ఉండాలి


శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: స్వచ్ఛ సర్వేక్షణ్-2023కు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అందరు సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్ అన్నారు. శుక్రవారం ఆయన జోనల్ కార్యాలయంలో జోన్ పరిధిలో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పరిశుభ్రతే ధ్యేయంగా పనులు చేయాలన్నారు. ఇందులో పారిశుధ్య అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. అప్పుడే మనమందరం నగరానికి ర్యాంక్ సాధించుకోగలమని అన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత ముందుకు వెళ్లే విధంగా పని చేయాలన్నారు. ప్రధాన కాలువలు, గెడ్డలు, మార్కెట్లు, సులభ్ కాంప్లెక్సులు, వీధులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలన్నారు. జోన్‌లో ప్రధాన రహదారులపై దృష్టి సారించి పరిశుభ్రం చేయాలన్నారు. అదే విధంగా యూజర్ చార్జీల వసూలు వేగవంతం చేయాలన్నారు. సెక్రటరీలు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి


సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

అల్లిపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ సూచించారు. శుక్రవారం ఆయన టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లోని ట్రాఫిక్ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పరిసరాలు, సిబ్బంది డ్యూటీ చార్టులు, జనరల్ డైరీ తదితరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని తెలిపారు. బ్లాకోట్స్, ట్రాకోట్స్ పనితీరును ట్రాఫిక్ సీఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్ ఉండేటట్లు చూసుకోవాలన్నారు. సుప్రా వెహికల్‌తో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు నిత్యం రద్దీ ప్రాంతాల్లో చేపట్టాలన్నారు. రోడ్ సేఫ్టీ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నగరంలో జరిగిన కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత క్వార్టర్‌లో 335 మరణాలు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 92 నమోదు అయ్యాయని, ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయని, నగర పోలీసులు తీసుకున్న చర్యల కారణంగానే మరణాల శాతం తగ్గిందని జిల్లా కలెక్టర్ మల్లికార్జున అభినందించారని సిబ్బందికి వివరించారు. నగరంలో అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ సేఫ్టీ స్టిక్కర్లు, స్టాపర్లు, జీబ్రా లైన్ల వంటి పలు ఏర్పాట్లు రోడ్ సేఫ్టీలో భాగంగా స్పాన్సర్లు, వలంటీర్ల ద్వారా సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ ఏసీపీ రమణమూర్తి, టూటౌన్ ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో అనధికార, అక్రమ నిర్మాణాలపైనే ఫిర్యాదులు అందాయి. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ ప్రణాళికా అధికారులను ఆదేశించినట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ పరిధి 8 జోన్లలో ఎటువంటి అనధికార నిర్మాణాలు చేపట్టినా, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు, టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా సమస్య తెలపవచ్చు. లేదా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు తెలిపి పూర్తి వివరాలు (డోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్‌కు పంపితే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ద్వారాపై అధికారులకు నివేదించి, ఆ సమస్య సత్వర చర్యలు చేపట్టనున్నట్టు ప్రధాన సిటీ ప్లానర్ బి. సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం టౌన్‌ప్లానింగ్‌పై స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జోన్-2 నుంచి ఒకటి, జోన్-3 నుంచి రెండు, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి రెండు, జోన్-6 నుంచి ఒకటి, జోన్-7 నుంచి ఒకటి, జోన్-8 నుంచి ఒక ఫిర్యాదు వచ్చింది. సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీసీపీ-1 కె. పద్మజ స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన సిటీ ప్లానర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఎటువంటి ఫిర్యాదు చేయాలన్నా టోల్ ఫ్రీ నంబరుతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ నంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం


వ్యాపారుల నుంచి స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్లతో అధికారులు

జగదాంబ: ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్ అన్నారు. శుక్రవారం పూర్ణామార్కెట్‌లో కూరగాయల దుకాణాలు, హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అయినప్పటికీ దుకాణాల్లో వ్యాపారులు యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారన్నారు. దీనివలన మళ్లీ ప్లాస్టిక్ వినియోగం పెరిగిందన్నారు. కవర్ల అమ్మకాలు చేస్తే ఆయా దుకాణాలపై అపరాధ రుసుం విధించడంతో పాటు ట్రేడ్ లైసెన్సులు రద్దు చేస్తామని ఏఎంహెచ్‌వో హెచ్చరించారు. భూమిలో కలిసిపోయే 125 మైక్రాన్ కవర్లు మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. అలాగే ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు విధి విధానాల ప్రకారం (నాన్ ఓవెన్ కవర్లు) పీచు ఎక్కువగా ఉన్న సంచులు కూడా నిషేధించబడ్డాయన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం నిర్వహించిన దాడుల్లో రూ. లక్షా మూడు వేలు అపరాధ రుసుము విధించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎం పర్యటన


విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఎం మనోజ్‌శర్మ, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శుక్రవారం విశాఖలో పర్యటించారు. డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి విశాఖ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వాల్తేర్ డివిజన్ ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడి, వివిధ విషయాలపై వారి నుంచి సూచనలు సలహాలు తీసుకున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. ఈ పనులపై గతిశక్తి ప్రాజెక్టు అధికారులతో కలిసి సమీక్షించారు. సెల్ఫ్ ప్రొఫైల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్‌లో జీఎం మనోజ్ శర్మ మార్షలింగ్ యార్డ్, కోచింగ్ యార్డ్, గోపాలపట్నం యార్డ్, సింహాచలం నార్త్ యార్డ్ వంటి కీలక ప్రాంతాలను పర్యటించారు. అనంతరం వైజాగ్ స్టీల్ ప్లాంట్ రైల్వే సైడింగ్‌ను పరీక్షించారు. స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌తో సమావేశమై పలు మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. అదాని గంగవరం పోర్టు అధికారులతో జీఎం సమావేశమయ్యారు. చివరిగా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను జీఎం పరిశీలించారు. పర్యటనలో పలువురు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

28న టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

దాబాగార్డెన్స్: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు మాస్టర్‌మైండ్స్ వైజాగ్ శాఖ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి తెలిపారు. స్టేట్ సిలబస్, ఐసీఎస్ఈ సిలబస్ చదివిన విద్యార్థులు 550 మార్కులు పైబడి, సీబీఎస్ఈ విద్యార్థులు 450 మార్కులు పైబడి ప్రతిభ చూపించిన విద్యార్థులను మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం ఘనంగా సత్కరించి, ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు వీఐపీ రోడ్డులోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో ప్రతిభ పురస్కారాల పేరిట కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు గుర్తింపు కార్డు (ఆధార్/స్కూల్ ఐడీ కార్డు), పదో తరగతి పరీక్షల్లో సాధించిన మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ) తీసుకొని రావాలని, అలాగే ప్రతిభ పురస్కారాల కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు రిజిస్ట్రేషన్లకు 99898 93943, 92487 13330 నంబర్లలో సంప్రదించవచ్చు. విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేయనున్నట్టు ప్రిన్సిపాల్ అంజిరెడ్డి తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి


పారిశుధ్య కార్మికుల పనులను పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

అల్లిపురం: జోన్-4 పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఏఎంహెచ్‌వో ఎన్.కిశోర్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. 34వ వార్డు కొబ్బరితోట, మురళీధరవీధి, లక్ష్మీదేవిపేట, అంబేడ్కర్ కాలనీ, పీహెచ్‌సీ ప్రాంతంలో పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు విధిగా రోడ్లు శుభ్రపరచాలని, కాలువల్లో చెత్తను తొలగించాలని సూచించారు.

దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి


కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న ఐడీజేఎన్ సభ్యులు

బీచ్ రోడ్డు: రాష్ట్రవ్యాప్తంగా దళిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్ట్ నెట్‌వర్క్ (ఐడీజేఎన్) సభ్యులు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో పలు చోట్ల దళిత జర్నలిస్టులపై దాడులు, తప్పుడు కేసులు నమోదవుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు పాత్రికేయులకు 300 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐడీజేఎన్ రాష్ట్ర అధ్యక్షుడు తంగేటి నానాజీ, సహాయ కార్యదర్శి పి.సత్యనారాయణ, జిల్లా ప్రతినిధులు గొట్టివాడ ధనేష్, జి.ఆనంద్ పాల్గొన్నారు.

నేడు సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టండి


బీచ్‌రోడ్డులో వర్షపు నీటి నిల్వపై ఆరా తీస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: బీచ్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. బీచ్‌రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ వద్ద ప్రధాన కాల్వలను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నెలకు రెండుసార్లు ప్రధాన కాలువల పూడికలు తొలగించాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ కూడా శుభ్రపరచాలన్నారు. వర్షాకాలంలో ప్రధాన కాలువలు పొంగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీటితో పాటు పూడికలు అధికంగా వస్తాయని, అలా రాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కమిషనర్ అటవీశాఖ అధికారి అనంతశంకర్‌తో కలిసి వైఎస్సార్ వ్యూ పాయింట్, సాగర్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బీచ్ అభివృద్ధికి కావల్సిన అనుమతులపై చర్చించారు. పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, జోనల్ కమిషనర్ శివ ప్రసాద్, పర్యవేక్షక ఇంజనీర్లు సత్యనారాయణ, వేణుగోపాల్, ఏఎంవోహెచ్ డాక్టర్ ఎస్. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తం


రక్త నమూనాలు తీసుకుంటున్న మలేరియా, ఆశ వర్కర్లు

అల్లిపురం: ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయటం మంచిది కాదని మలేరియా, ఆరోగ్య సిబ్బంది హెచ్చరించారు. జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో వెంకటేశ్వరమెట్టపై మలేరియా, డెంగ్యూ వ్యాధులు బయట పడటంతో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా లక్షణాలు తెలుసుకుని ఆ తరువాత తగిన చికిత్స చేయించుకోవడం అవసరమని తెలిపారు. వాతావరణ మార్పుల వలన వచ్చే డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్త పడాలన్నారు. దోమలు కుట్టకుండా క్రీములు, లోషన్స్ వంటివి రాసుకోవాలి. దోమలు రాకుండా దోమ తెరలు వంటివి కట్టుకోవాలని, ఇంట్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పాడైపోయిన ఆహారాన్ని ఉంచరాదని సూచించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో ప్రతి ఒక్కరికి రక్త నమూనాలు తీసుకున్నారు. అవసరమైన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కన్నుల పండువగా మహా కుంభాభిషేకం

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ ధర్మశాస్త (అయ్యప్ప స్వామి) దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ జరిగి పుష్కర కాలం పూర్తయిన సందర్భంగా దేవాలయంలో మహా కుంభాభిషేకం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. టీటీడీ అధర్వణ వేద పండితులు, అక్కాజ్యోస్యుల రమేశశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాత గ్రంధి రాజేష్, రమ దంపతుల చేతుల మీదుగా పుణ్యనది జలాలతో కూడి అష్టోత్తర కలశములు (108), సుగంధ ద్రవ్యాలతో వైభవంగా స్నపనం చేపట్టారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి, గురుస్వాములు డీవీఎస్ మూర్తి, నీలాపు రమణారెడ్డి, ఎల్.ఎ.సుకుమార్ పర్యవేక్షణలో వేదపారాయణ పఠనం, మంటప ప్రాతఃకాల అర్చనలు, అష్టోత్తర కలశ అభిమంత్రన, మూల విరాట్ సహిత శిఖర అష్టోత్తర కలశములతో అభిషేకములు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పుష్పాలంకరణ, సహస్రనామ అర్చన, సూర్య నమస్కారాలు, మహా లింగార్చన, మూలమంత్ర హవనం, సర్వదేవతా హవనం, మహా పూర్ణాహుతి, వేద ఆశీర్వచనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వి రాజక్‌ను అభినందించిన కలెక్టర్


పూర్వి రాజక్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : విశాఖకు చెందిన పూర్వి రాజక్‌ను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సూపర్ టాలెంటెడ్ కిడ్-2023గా ప్రకటించింది. దీంతో శుక్రవారం పూర్వి రాజక్ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసింది. కలెక్టర్ పూర్వి రాజక్‌ను అభినందించారు. 12 సంవత్సరాల వయస్సు గల పూర్వి రాజక్ కళ, సాహిత్యం, క్రీడా రంగాల్లో తనదైన ముద్ర వేసింది. ఆమె తన మూడు సంవత్సరాల వయసులో మొదటి అవార్డు గెలుచుకుంది. అనంతరం మల్టీ టాలెంటెడ్ గర్ల్‌గా అనేక అవార్డులు గెలుచుకుంది. స్కూలు, ఇంటర్ స్కూలు, డిస్ట్రిక్ట్, స్టేట్, నేషనల్, ఇంటర్నేషనల్ స్థాయిలో ఆర్ట్, కరాటే, ఎలక్ట్రికల్ రంగాల్లో 300 కంటే ఎక్కువ అవార్డులు, బహుమతులు గెలుచుకుంది. ఈమె పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2022లో నమోదు చేసింది. రచయిత్రి, కళాకారిణి, కవయిత్రి, వక్త, కరాటే నిపుణురాలు, సామాజిక కార్యకర్తగా విజయాలు సాధించి బంగారు పతక విజేతగా నిలిచింది.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మహిళా కార్యకర్తలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదే అని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. శుక్రవారం ఆయన పూర్ణామార్కెట్ దరి వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో మహిళా కార్యకర్తలతో మాట్లాడారు. జగనన్న మహిళలకే పెద్దపీట వేశారన్నారు. అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా అమ్మఒడి, ఒంటరి మహిళ వంటి ఎన్నో పథకాలు అందించారన్నారు. ఇటువంటి నాయకుడిని మళ్లీ మనం సీఎంగా చేసుకోవాలంటే అందరూ సంక్షేమ పథకాలు ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. అనంతరం వార్డు సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. సమస్యల పరిష్కారం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ జగన్నాథ స్వామి వారి దేవాలయం

దేవదాయ ధర్మదాయశాఖ, మెయిన్‌రోడ్, విశాఖపట్నం

టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

విశాఖపట్నం నగరం, మెయిన్‌రోడ్‌లో వేంచేసియున్న శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం రథయాత్ర సందర్భంలో ఈ క్రింది తెలిపిన సీల్డ్ టెండర్లు, కొటేషన్స్ మరియు టెండర్ కం బహిరంగ వేలంపాటను తేది. 31-05-2023న దేవస్థానం నందు బుధవారం ఉదయం గం 10:00 నుండి నిర్వహించబడును.

వరుస నెం.	వేలం వివరములు	ప్రథమ ధరావత్తు	లైసెన్సు కాలం
1.	భక్తులచే సమర్పించబడిన కొబ్బరి చెక్కల (సగ భాగం) ప్రోగు చేసుకొనే హక్కు కొరకు	రూ.50,000/-	తేది 20-06-2023 నుండి 30-06-2023 వరకు
2.	ప్రసాదం తయారీ కొరకు దినవర్తకముల సరఫరా కొరకు	రూ. 20,000/-	
3.	భక్తుల యొక్క పాద రక్షలు భద్రపరచు హక్కు కొరకు	రూ.10,000/-	
4.	షామియానా పెండాల్స్, బెంచ్లు కుర్చీలు, టేబుల్స్, వంట పాత్రలు, కార్పెట్స్ వగైరాలకు రోజువారి సరఫరా కొరకు	రూ.20,000/-	
5.	విద్యుత్ దీపాలంకరణ దేవాలయం మరియు టర్నర్ సత్రం ఆవరణములో	రూ.20,000/-	
6.	దశావతారములకు పుష్పాలంకరణ పూలదండలు, రథమునకు పుష్పాలంకరణ, సరఫరా కొరకు.	రూ.20,000/-	

సీల్డ్ టెండర్లు దాఖలు చేయువారు టెండర్లుతోపాటుగా పైన తెలిపిన ధరావత్తు సొమ్మును బ్యాంకు డ్రాఫ్టు ద్వారా కార్యనిర్వహణాధికారి, శ్రీ జగన్నాథస్వామి వారి దేవస్థానం, విశాఖపట్నం వారి పేరున తీసుకుని జతపరచవలెను. హెచ్చుపాటదారుడు పాట ముగిసిన వెంటనే శిస్తు సొమ్మును డిపాజిట్‌గా చెల్లించవలెను. మిగిలిన పాట షరతులు మరియు వివరములు శ్రీ జగన్నాథస్వామి వారి దేవాలయము కార్యాలయము నందు పనిచేయు వేళలలో తెలుసుకొనవలెను. ఫోన్: 99511 39429

విశాఖపట్నం, తేది: 26-05-2023 — టి.రాజగోపాలరెడ్డి, కార్యనిర్వహణాధికారి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన


నృత్యంతో ఆకట్టుకున్న చిన్నారులు

దాబాగార్డెన్స్: నగరంలోని అల్లిపురంలో వెలసిన కొత్తమ్మ జాతరను పురస్కరించుకుని చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. నాట్య దీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో శుక్రవారం చిన్నారులు చక్కగా నృత్య రీతులను ప్రదర్శించారు.

చిన్నారులు క్రీడల్లో రాణించాలి


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న మహ్మద్ సాధిక్

జగదాంబ: చిన్నారులు క్రీడల్లో రాణించాలని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాధిక్ అన్నారు. శుక్రవారం వార్డులోని ఎంవీడీఎం పాఠశాల చిన్నారులకు సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఇలాంటి క్యాంప్‌లతో అభివృద్ధి చెందుతారన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎందరో ప్రముఖులు ఒకప్పుడు గల్లీల నుంచి వచ్చిన వారేనన్నారు. అటువంటి వారందరినీ దృష్టిలో పెట్టుకుని క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం ఆటల్లో పాల్గొన్న చిన్నారులకు జీవీఎంసీ ఏర్పాటు చేసిన డైట్ (పౌష్టికాహారం)ను సాధిక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలు


మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) శ్రీనివాసమూర్తి అధ్యక్షతన కలెక్టర్ సమావేశ మందిరంలో జరిగింది. జూన్ 1 నుంచి 30 వరకు చైల్డ్ లేబర్ వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు కార్మిక శాఖ జిల్లా అధికారి ఎం.సునీత తెలిపారు. 2025 నాటికి బాల కార్మికులు ఎవరూ ఉండకూడదనే నిబంధనతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్మిక శాఖకు ఇతర శాఖల అధికారులు సహకారం అందించాలని కోరారు. అన్ని శాఖలు సమన్వయంతో ముందుకెళ్లి చైల్డ్ లేబర్ వ్యవస్థను రూపుమాపి బాలలకు విముక్తి కలిగించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో పూర్ణిమ, ఏసీపీ వెంకటరావు, డీపీవో శరత్‌బాబు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి రాధ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.